క్లుప్తంగా

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు బీజేపీలో చేరుతున్నారని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామేశ్వరం, జోగమ్మగూడ, రాయికల్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నేతలు దొడల వెంకటేశ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి విష్ణువర్ధన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లష్కర్ నాయక్, ఆకుల ప్రదీప్, శ్యాంసుందర్‌రెడ్డి, రఘుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం అందజేత



భూమి పూజ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన కూడలి వీరేశ్‌కు బీఆర్‌ఎస్ యువ నాయకుడు వేణుగోపాల చారి రూ.4,50,000లతో గ్రామంలోనే ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి ఆదివారం ఎంపీపీ రవీందర్ యాదవ్ జన్మదినం సందర్భంగా అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణానికి భూమి పూజా చేశారు. గ్రామస్తులు స్థలం అందజేసిన దాతను అభినందించారు. కొత్తపేట, పుట్టోనిగూడ సర్పంచులు నవీన్‌కుమార్, జగన్ నాయక్, జంగయ్య, శ్రీనివాస్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం వద్ద రైతు రాములు

షాబాద్: విద్యుదాఘాతంతో పాడి పశువు మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన మద్దూరు రాములుకు చెందిన ఆవు మేత మేయడానికి వెళ్లి కంచలేని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మేత మేస్తూ.. పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి మృత్యువాత పడింది. ఆవు విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా రాందేవ్‌బాబా జయంతి



పాదయాత్రలో మార్వాడీ సంఘం సభ్యులు

కొత్తూరు: మార్వాడీల ఆరాధ్యదైవం రాందేవ్ బాబా జయంతి వేడుకలను కొత్తూరు పట్టణంలో ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు అరవింద్ మిర్థా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మహిళలు, యువకులు కొత్తూరు నుంచి ఆరాంఘర్ వద్ద రాందేవ్‌బాబా ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, సజ్జన్‌లాల్, నిమిచంద్, హరిలాల్ శర్మ, అశోక్‌పటేల్, మనోజ్‌వైష్ణవ్, సునీల్, హనుమాన్, కాలురామ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



మొయినాబాద్‌రూరల్: ప్రారంభిస్తున్న మహమూద్ అలీ

మొయినాబాద్‌రూరల్: యువత ఉద్యోగాలు రాలేదని నిరుత్సాహపడకుండా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. హిమాయత్ నగర్ చౌరస్తాలో కోయినూర్ పేరుతో మహ్మద్ అబ్దుల్ జహీర్ జనా ఏర్పాటు చేసుకున్న షాపింగ్‌మాల్‌ను ఆయన ప్రారంభించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ
- ఏ రాష్ట్రంలో లేని పథకాలు మనవద్దే..
- మహనీయుల అడుగు జాడల్లో నడవాలి
- జాతీయ సమైక్యతా దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

తుర్కయంజాల్: నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో సీఎం కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కొంగరకలాన్‌లోని జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామిక స్వేచ్ఛ వైపు పరివర్తన చెందడానికి యావత్ తెలంగాణ సమాజం చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే ముందంజలో ఉన్నామన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా మరే రాష్ట్రంలో అమలులో లేవని గుర్తుచేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు, దసరా కానుకగా ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసుకుని పంట పొలాలకు నీరందిస్తున్నామని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో లక్షల ఎకరాల భూములు సాగులోకి రానున్నాయని తెలిపారు.

త్యాగాల ఫలితమే తెలంగాణ

ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ సువిశాల భారతదేశంలో అంతర్భాగంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ఆదిలాబాద్ అడవుల్లో తుడం దెబ్బ మోగించిన కొమురం భీమ్, భూస్వాముల ఆగడాలకు బలైన దొడ్డి కొమురయ్య, రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణ రెడ్డి, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి అడుగుపెట్టి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను స్థాపించిన స్వామి రామానంద తీర్థ, భూపోరాటాలకు ప్రేరణగా నిలిచిన చాకలి ఐలమ్మ, వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిన మానవతావాది భీంరెడ్డి నర్సింహారెడ్డి, గీత కార్మికుల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన బొమ్మగాని ధర్మభిక్షం, ప్రజాపోరాటానికి సేనానిగా నిలిచిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కమలాదేవితో పాటు సర్దార్ జమలాపురం కేశవరావు, వట్టికోట అళ్వార్ స్వామి, దేవులపల్లి వెంకటేశ్వర రావు, బద్దం ఎల్లారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజి, మగ్దూం మొహియొద్దీన్, షోయబుల్లాఖాన్, బండి యాదగిరి, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు వంటి వారంతా త్యాగాలతో చరిత్రను లిఖించారని వివరించారు. వారిని జాతి ఎప్పటికీ మరవదన్నారు. మహనీయుల అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతతోనే వ్యాధులు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



పారిశుద్ధ్య పనులు చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

షాద్‌నగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే ప్రారంభించి, ఫరూఖ్‌నగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రాణాంతకమైన వ్యాధులు దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దన్నారు. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కమిషనర్ వెంకన్న, పాల్గొన్నారు.

నందిగామలో...

నందిగామ మండలం మేకగూడ గ్రామపంచాయతీ సంఘీగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వార్డు మాజీ సభ్యుడు జంగయ్య, శాంతి, వార్డు సభ్యుడు మల్లేశ్, జంగయ్య, భిక్షపతి, శేఖర్, మహేశ్, రమేష్, శేఖర్, పాండు, యాదయ్య, జంగయ్య, ఉన్నారు.

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే యాదయ్య వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కౌన్సిలర్ గోపాల్, రాంరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తా

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



మాట్లాడుతున్న లావణ్య

కొత్తూరు: ప్రతీ ఒక్కరి భాగస్వామ్యంతో కొత్తూరు మున్సిపాలిటీ జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఆదివారం ఆమె పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పట్టణంలోని సాయిరెడ్డి చెరువు, పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ప్రతిరోజు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో చెత్తను తొలగించడానికి పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన చెత్తను పారబోయకుండా సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు. చికెన్, చేపల వ్యాపారులు వ్యర్థాలను రోడ్ల పక్కన పారబోయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వీరేందర్, వైస్ చైర్మన్ రవీందర్, దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్లు సోమ్లనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతీక

షాబాద్ సీఐ యాదయ్యగౌడ్



మాట్లాడుతున్న సీఐ యాదయ్యగౌడ్

షాబాద్: పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. రానున్న వినాయకచవితి, మిలాద్ ఉన్‌నబీ కులమతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక ఉత్సవ నిర్వాహకులు అన్ని వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఎక్కువ విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశం ఉందన్నారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా వ్యవహరించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. మంటపాల వద్ద తగిన భద్రతను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మహేశ్వర్‌రెడ్డి, రాజేందర్, ఏఎస్ఐ రామ్‌లాల్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి 23న స్పాట్ కౌన్సెలింగ్

మొయినాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 23న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రంగారెడ్డి, హైదరాబాద్ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటీజీ సెట్ 23–24 నాలుగు ఫేస్‌లలో, బీఎల్‌వీ సెట్–23 ఐదో ఫేస్‌లో ఎంపికై వివిధ కారణాల వలన అడ్మిట్ కాని ఎస్సీ విద్యార్థిని, విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు వీటీజీ సెట్, బీఎల్‌వీ సెట్ హాల్‌టికెట్లు, అడ్మిషన్ పొందిన ధృవ పత్రాలు తీసుకుని, ఈ నెల 23న షేక్‌పేట్‌లోని గురుకుల పాఠశాలలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. అడ్మిషన్ల కేటాయింపులో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దివ్యాంగులు, అనాథ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు.

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య



పాండు (ఫైల్)

చేవెళ్ల: వ్యవసాయ పొలం వద్ద పశువుల కొట్టంలో ఉరివేసుకుని ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ గ్రామానికి చెందిన బేగరి పాండు(55)కు వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసేవాడు. పొలంలో పనిలేని సమయంలో కూలీ పనులకు వెళ్లేవాడు. కొంత కాలంగా పాండు అనారోగ్యంతో బాధపడుతూ వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువులకొట్టంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందడంతో వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

అక్కాచెల్లెళ్లు కేసు వేయడంతోనే!

పాండుకు వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల భూమి ఇంకా అతని తల్లిపేరనే ఉంది. భూమిని తన పేరుకు మార్చాలని పాండు తన తల్లిని కోరాడు. ఇంతలోనే పాండు అక్కాచెల్లెళ్లు భూమిపై కేసు వేశారు. దీంతో పాండు మనస్థాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



షాద్‌నగర్ రూరల్: ర్యాలీలో పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లిశంకర్



చేవెళ్ల: తుక్కుగూడ బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని సర్పంచ్ బండారి శైలజ అన్నారు.

తుక్కుగూడలో ఆదివారం నిర్వహించిన విజయభేరి భారీ బహిరంగసభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

షాబాద్‌లో..

షాబాద్: షాబాద్ నుంచి తుక్కుగూడ విజయభేరి సభకు అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలినట్లు పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహణ సభ్యులు పామెన భీంభరత్ అన్నారు. పీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మహిళ అధ్యక్షురాలు అశ్విని, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి భారీసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు జెండా ఊపి వాహనాలను తరలించారు.

విశ్వకర్మల అభివృద్ధికి కృషి



చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: విశ్వకర్మ జయంతి వేడుకలను ఆదివారం మొయినాబాద్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన, మహాయజ్ఞం చేపట్టారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని పూజలు నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: విశ్వకర్మల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు మధుసూదన్‌చారి పేర్కొన్నారు. షాబాద్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌చారి పాల్గొన్నారు.

కేశంపేట: మండల అధ్యక్షుడు ద్రోణాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించి యజ్ఞం నిర్వహించారు. యాదయ్యాచారి, రాజు చారి, జంగచారి, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి



షాబాద్: జెండా ఆవిష్కరిస్తున్న అలీ దేవేందర్

షాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది రైతులు ప్రాణాలర్పించారని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి అలీ దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం నరెడ్లగూడ గ్రామంలో సీఐటీయూ జెండా ఎగురవేశారు. మండల అధ్యక్షుడు సత్తయ్య, సీఐటీయూ నాయకులు జంగయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: వారోత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగసభకు ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఎండీ జాంగీర్, తదితరులు పాల్గొన్నారు.

సంతాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న అంజయ్య యాదవ్, గువ్వల బాలరాజు, మాజీ ఎంపీ వివేక్

కేశంపేట: సంతాపూర్‌లో ఆదివారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. షాద్‌నగర్, అచ్చంపేట ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, గువ్వల బాలరాజు, పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామిలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతీ ఒక్కరు ముందుకు తీసుకువెళ్లాలని వారు సూచించారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు



దీక్షలో మాట్లాడుతున్న నర్సింహా



కొందుర్గులో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొందుర్గు: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు కొందుర్గు మండల కేంద్రంలో రిలే నిరహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఆదివారం చేపట్టిన దీక్షలో ఎమ్మార్పీఎస్ షాద్‌నగర్ ఇన్‌చార్జి అనంతయ్య పాల్గొని మాట్లాడారు. మండల ఇన్‌చార్జి వినోద్, శివ,

వర్గీకరణ బిల్లుపై ప్రకటన చేయండి

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టే తేదీని ప్రకటించాలని విమోచన దినోత్సవంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షానుద్దేశించి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్లనర్సింహా పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బొబ్బిలిగామ పాండు చేపట్టిన దీక్ష కొనసాగుతున్నాయి. బుర్రరాంచంద్రయ్య, మహేందర్, సురేష్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



చేవెళ్లలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న రామకృష్ణారావు

చేవెళ్ల: మట్టి వినాయక విగ్రహాలను పూజించి ప్రకృతిని కాపాడాలని పర్యావరణ అవార్డు గ్రహీత రామకృష్ణారావు అన్నారు. చేవెళ్ల హనుమాన్ మందిరంలో భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

షాద్‌నగర్: మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు అందరు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మావతీ కాలనీలో కౌన్సిలర్ మాధురి నంద కిషోర్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీని నిర్వహించారు. కాలుష్య రహిత సమాజం కోసం అందరు పాటు పడాలని ఆయన పేర్కొన్నారు. శ్రీనివాసులు, పెద్ది రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ పేర్కొన్నారు. షాబాద్ మండల కేంద్రంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. లింగప్ప, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది



షాబాద్‌లో జాతీయ జెండా ఎగురువేస్తున్న బీజేపీ నాయకులు

షాబాద్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: సర్దార్ వల్లబాయి పటేల్ రజాకార్ల ఆగడాల నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించారని, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో విలీనం చేసిన రోజు అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి పేర్కొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ, పెద్దఎల్కిచర్ల గ్రామ పంచాయతీ వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు.

కేశంపేటలో..

కేశంపేట: బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, విఠల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: కనకమామిడి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో మర్రి రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర స్వామి గుట్ట చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.